క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. స్వామి అమ్మవార్లకు ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. 10.30 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి ఆభరణాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు.

తడ తహసీల్దార్‌గా జేజే రావు

తడ: మండల తహసీల్దార్‌గా కటారి జయజయరావు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న రామయ్య పెళ్లకూరుకు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న జేజే రావు తడకు వచ్చారు. ఈ సందర్భంగా జేజే రావు రామయ్యను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

విద్యుత్‌శాఖ ఈఈ బాధ్యతల స్వీకరణ

నాయుడుపేటటౌన్: నాయుడుపేట ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈగా కుందుర్తి ప్రసన్న కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ సర్కిల్ కార్యాలయంలో ఈఈ (టెక్నికల్)గా పనిచేస్తున్న ప్రసన్నకుమార్ బదిలీపై నాయుడుపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణప్రసాద్ ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ప్రసన్న కుమార్ గతంలో నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో డీఈగా పనిచేశారు. సబ్ డివిజన్ పరిధిలోని ఉద్యోగులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిట్టమూరు: మండల పరిధిలోని గునపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలు పొందేందుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య శనివారం తెలిపారు. 8వ తరగతి చదువుతున్న నిఖిల, మన్విత, భగీరథ్ ఎంపికయ్యారని చెప్పారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనాలు అందుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఆస్తి పన్ను చెల్లింపులో వెంకటగిరి టాప్



చైర్‌పర్సన్‌తో కమిషనర్ వెంకటరామయ్య

వెంకటగిరి: ఆస్తి పన్ను చెల్లింపులో తిరుపతి జిల్లా పరిధిలో వెంకటగిరి మున్సిపాలిటీ మొదటి స్థానంలో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. మొదటి స్థానం రావడానికి సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియను శనివారం ఆమె నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న 123 మున్సిపాలిటీల్లో వెంకటగిరి 7వ స్థానంలో ఉందన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నాయుడుపేట: పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని వైద్యాధికారిణి మౌనిక అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ బాలుర గురుకులంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గురుకుల విద్యా సంస్థల ప్రిన్సిపల్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మేధోసంపత్తి పెరగాలంటే ఏకాగ్రత అవసరమన్నారు. ఏకాగ్రత కావాలంటే మంచి ఆరోగ్యం అవసరమని తెలిపారు. ప్రతి విద్యార్థి పరిశుభ్రత పాటిస్తే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. హెచ్‌ఎం ప్రసన్న, కల్పన ఉన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం



సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ దక్షిణం వైపు హోమ్ సిగ్నల్ వద్ద గుర్తుతెలియన వృద్ధుడి మృతదేహాన్ని రైల్వేపోలీసులు శనివారం గుర్తించారు. సూళ్లూరుపేట జీఆర్పీ ఎస్‌ఐ మాలకొండయ్య సమాచారం మేరకు మృతుడు తెల్లచొక్కా, పంచె ధరించి ఉన్నాడని, చెన్నై సెంటర్ నుంచి గూడూరు జంక్షన్ వరకు టికెట్ ఉందని తెలిపారు. రైలు నుంచి జారిపడి దిగువ రైల్వే లైను మధ్యలో చనిపోయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మిర్చికి తెగులు.. రైతుకు దిగులు

- ఎండుకొమ్మ, బూడిద, పండాకు తెగుళ్లు అధికం
- ఎన్ని మందులు పిచికారీ చేసినా నివారణ శూన్యం
- ఆందోళనలో రైతులు
- ఆర్బీకేల ద్వారా సూచనలు చేస్తున్న అధికారులు



గుర్రంకొండలో మిర్చికి పురుగు మందు స్ప్రే చేస్తున్న రైతు

ఓజిలి: అకాల వర్షాలు.. పెరిగిన పెట్టుబడులు.. తెగుళ్ల ప్రభావంతో మిర్చి రైతులు తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసినా తెగుళ్ల సమస్య కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఓజిలి మండల పరిధిలోని మానమాల, కురుగొండ, చిలమానుచేను, పెదపరియ, ముమ్మాయపాళెం, మాచవరం, తిరుమలపూడి తదితర గ్రామాల్లో 1000 ఎకరాల్లో రైతులు మిర్చి పంటను సాగు చేశారు. సాగుచేసిన నాటి నుంచి వర్షాలు కురవడంతో మొలక దశ నుంచే తెగుళ్లు అధికంగా ఆశించాయి. బూడిద, పండాకు, ఎండు కొమ్మ, వైరస్ తెగుళ్లు ఆశించడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులతో బూడిద తెగులు ఎక్కువగా ఆశిస్తోంది. ఫలితంగా ఆకులు రాలిపోయి రైతును కోలుకోలేని దెబ్బ తీస్తోంది. కాయలు తెల్లగా మారిపోతున్నాయి. ఎండుకొమ్మ తెగులు వ్యాపించి మొక్క దశలోనే చనిపోతున్నాయి. దీనికి తోడు ఆకుముడత ఎక్కువగా వ్యాపిస్తూ ఆకులు ముడుచుకుపోయి పురుగులు ఆశిస్తున్నాయి. రైతులు ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావడం లేదు. ఎకరం పంట సాగు చేసేందుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. రెండేళ్ల నుంచి ఆదాయం వస్తుండడంతో ఈ ఏడాది కూడా బోర్ల కింద మిర్చిని సాగు చేశారు. పంట దిగుబడి పెరిగి మంచి ఆదాయం వస్తుందనుకున్న రైతులను నిరాశే ఎదురవుతోంది. అధికారులు స్పందించి సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ధరలు ఇలా..

పచ్చిమిర్చి మార్కెట్‌లో
కేజీ రూ. 22 నుంచి రూ. 25

పండు మిర్చి
కేజీ రూ. 230 నుంచి రూ. 250



మిరప పంటకు సోకిన ఎండుకొమ్మ తెగులు

తెగుళ్లతో ఇబ్బంది పడుతున్నాం



“గ్రామంలో సుమారు ఎకరం పొలంలో మిర్చి పంటను సాగు చేశా. తెగుళ్లు అధికంగా వ్యాపించాయి. ఎండుకొమ్మ, వైరస్ తెగుళ్లు ఆశించి దిగుబడి రావడం లేదు. అకాల వర్షాలకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ఈ ఏడాది పెట్టుబడులు కూడా వచ్చేలా కనిపించడం లేదు.
–కొక్కొళ్ల వెంకటేశ్వర్లు, ఆర్మేనిపాడు, ఓజిలి

అకాల వర్షంతో పంటకు దెబ్బ



అకాల వర్షంతో మిరప పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షంతో బుడిద, ఆకు ముడత, పండాకు వంటి తెగుళ్లు వ్యాపించాయి. ఎకరం సాగుకు సుమారుగా రూ. 70 వేల వరకు ఖర్చు చేశాం. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేకుండా పోతోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.– సుబ్బారెడ్డి మానమాల

రైతులకు సూచనలు చేస్తున్నాం



వాతావరణ పరిస్థితుల ప్రభావం, అకాల వర్షాల కారణంగా మిర్చి పంటకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. తెగుళ్ల ఉధృతిని రైతులు మా దృష్టికి తీసుకొస్తున్నారు. మిరప పంట రైతులకు తెగుళ్ల, సస్యరక్షణ చర్యలపై సూచనలు చేస్తున్నాం. ఆర్బీకే సిబ్బంది ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం.
– శారద, ఉద్యానవనశాఖాధికారి, నాయుడుపేట

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గూడూరు: పట్టణంలోని కోనేటిమిట్టలో వెలసిన శ్రీకోదండరామాంజనేయస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి మాడ వీధిల్లో ఊరేగించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ గరుడ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

ఓజిలి: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని రాచపాళెం గ్రామంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పుల్లంరాజు, దామోదర్‌రాజు, మోహన్‌రాజు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి గ్రామస్తులకు అన్నదానం చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. రాత్రి స్వామివారి కల్యాణోత్సవం జరిగింది.



మాడవీధుల్లో విహరిస్తున్న స్వామివారు

బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులతో సభ్యులు

నాయుడుపేట: నాయుడుపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా డి.హరనాథ్‌రెడ్డి వ్యవహరించారు. అధ్యక్షుడిగా జీవీఎస్‌కే కిషోర్, ఉపాధ్యక్షుడిగా టీవీ రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా పసల చెంగయ్య, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ హరిబాబు, కోశాధికారిగా కె.శ్రీనివాసులు ఏకగ్రీవమయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా షేక్ రఫీ, ఆశ కిరణ్, సురేష్, పరశురామ్, వీరాస్వామి ఎన్నికయ్యారు. నూతన కమిటీని న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు చదలవాడ కుమార్, మేర్లపాక శ్రీనివాసులు, పోట్లపూడి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

గూడూరు: పట్టణ సమీపంలోని గాంధీనగర్ క్రిస్టియన్ సమాధుల తోటలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని కమిటీ అధ్యక్షుడు, పాస్టర్ డేనియల్ రవికుమార్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ సీఆర్‌రెడ్డి భవన్‌లో శనివారం కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. క్రిస్టియన్ సమాధుల తోటలో మౌలిక వసతుల కల్పనకు నూతన కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కమిటీ ద్వారా ప్రహరీ నిర్మాణంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేస్తామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు లాజరస్, సెక్రటరీ ప్రభుదాస్, రవికుమార్, అబ్రహం కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు రవికుమార్

ఎమ్మెల్సీని కలిసిన తహసీల్దార్



గూడూరు: చిల్లకూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పఠాన్ అజ్మతుల్లా ఖాన్ శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తిని ఆయన ఇంట్లో కలిశారు.

ఉడతావారిపాలెంలో చోరీ

చిల్లకూరు: మండలంలోని ఉడతావారిపాళెం గ్రామంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఓ ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని నగదు, బంగారు వస్తువులను దుండగులు అపహరించారు. గ్రామానికి చెందిన వేంపల్లి రమణమ్మ శుక్రవారం రాత్రి ఇంటికి తాళాలు వేసుకుని పక్క ఇంట్లో నిద్రపోయింది. శనివారం ఉదయం నిద్రలేచి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాలోని రూ.20 వేల నగదు, నల్లపూసల దండ, మంగళసూత్రం, కమ్మలు, వెండి గజ్జలు చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

నాయుడుపేటటౌన్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పొదుపు సమాఖ్య మహిళలు, మెప్మా ఆర్పీలు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, కమిషనర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త నిర్వాహణ, ప్రమాదకర వ్యర్థాలు వేరు చేయడం, హోమ్ కంపోస్టింగ్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఆక్రమణల తొలగింపుపై సమీక్ష

కోట: పట్టణంలోని బజారువీధిలో ఆక్రమణల తొలగింపుపై తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కోటక్రాస్‌రోడ్డు నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా కొక్కుపాడు రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపునకు ఇటీవల సర్వే నిర్వహించినట్లు తెలిపారు. మార్కింగ్ పూర్తయిందని చెప్పారు. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా ఎంతమేరకు ఆక్రమణలు తొలగిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్న దానిపై సమీక్ష నిర్వహించినట్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ అరుణమ్మ తెలిపారు. త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

సైదాపురం: ఈ నెల 3వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు మండలంలోని సైదాపురం, కలిచేడు గ్రామాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ దయాకర్ తెలిపారు. ఆయా పాఠశాలల్లో 240 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. అనంతమడుగు, చాగణం, ఊటుకూరు, మర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 170 మంది విద్యార్థులు సైదాపురం పరీక్ష కేంద్రంలో.. కలిచేడు కేంద్రంలో 70 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు అన్ని ఏర్పాట్లు చేశామని.. వైద్య సిబ్బందిని కూడా నియమించామని తెలిపారు.

బాలాయపల్లెలో రెండు సెంటర్లు

వెంకటగిరిరూరల్ (బాలాయపల్లె): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు బాలాయపల్లె మండలంలో రెండు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ లక్ష్మన్న తెలిపారు. బాలాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120 మంది రెగ్యులర్, 38 మంది సప్లమెంటరీ, జయంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 85 మంది రెగ్యులర్, 16 మంది సప్లమెంటరీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీపై ఫిర్యాదు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామానికి చెందిన శివకుమార్ మోటార్ సైకిల్ శుక్రవారం రాత్రి చోరీకి గురైందని శనివారం చిట్టమూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు.. శుక్రవారం రాత్రి మల్లాంలో తన సూపర్ మార్కెట్ ఎదురుగా స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను ఉంచి వ్యాపారం చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి మోటర్ సైకిల్‌ను స్టార్ట్ చేసి తీసుకెళ్లాడు. పట్టుకునేందుకు ప్రయత్నించగా వేగంగా వెళ్లిపోయాడు.

కార్మికుల సమస్యలపై వినతి



ఆర్డీఓ, కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

గూడూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ, కమిషనర్ సాయినాథ్‌లకు వినతి పత్రాన్ని అందజేశారు. బాలసుబ్రమణ్యం, గోపీనాథ్, రాజగోపాల్, జోగి శివకుమార్ ఉన్నారు.

సమష్టిగా పార్టీని మరింత బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- నియోజవర్గ స్థాయిలో కన్వీనర్లకు దిశానిర్దేశం

సూళ్లూరుపేట రూరల్: అందరం సమష్టిగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేద్దామని.. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం సూళ్లూరుపేట నియోజకర్గస్థాయిలో ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీల జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు, 93 సచివాలయాల కన్వీనర్లతో స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై గృహసారథులు, మండల కన్వీనర్లు, మండల ఇన్‌చార్జ్‌లు ఇంటింటికి తిరిగి తెలుసుకోవాలని తెలిపారు. పార్టీకి సైనికుల్లా పనిచేయాలన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వ చేసిన పనులు.. మన ప్రభుత్వ చేసిన పనులను తేడా చూపిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డోర్ టూ డోర్ తిరిగి ప్రభుత్వ పథకాల తీరును అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాలను తెలియజేయాలన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 14 తేదీ వరకు ఈ కార్యక్రమం పూర్తి చేయాలని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేరవేర్చిన ఘనత మన సీఎంకే దక్కిందన్నారు. నవరత్నాల ద్వారా అందరికీ సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొందరు వెన్నుపోటు పొడిచారని.. ఈసారి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 2024 ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కొళవి రఘురెడ్డి, ధనలక్ష్మి, శేఖర్, చెంగాళమ్మ ట్రస్టుబోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, నాయుడుపేట మున్సిపాల్ చైర్‌పర్సన్ కట్టకం దీపిక, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ తమ్మిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్లు తమ్మిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, మండల ఇన్‌చార్జ్ మందా దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేఆర్‌ఆర్ యువసేన సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీ నేత కామిరెడ్డి రాజారెడ్డి సారథ్యంలో కేఆర్‌ఆర్ యువసేన చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట పట్టణంలోని కేఆర్‌ఆర్ కార్యాలయంలో శనివారం రాజారెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మదన్‌రెడ్డి, చిల్లకూరు బాలక్రిష్ణారెడ్డి కటకం జయరామయ్య రాజారెడ్డిని సత్కారించారు.



రాజారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

ద్రోహం చేసిన ఎమ్మెల్యేలు చరిత్రహీనులు



మాట్లాడుతున్న కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ బీఫారంతో, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో గెలిచి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలు చరిత్రహీనులుగా మిగిలిపోతారని వైఎస్సార్‌సీపీ నేత కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కైవల్యా నది బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి కటౌట్‌లను కైవల్యానదిలో నిమజ్జనం చేసి నిరసన తెలిపారు. నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విధానాలకు వ్యతిరేకంగా నడుచుకున్న ఎమ్మెల్యేల వైఖరి సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ధనియాల రాధమ్మ, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, నాయకులు పంజాం ధనంజయ్య, సర్పంచ్‌లు మస్తాన్, విజయమ్మ, జేసీఎస్ కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బహిష్కృత ఎమ్మెల్యేల కటౌట్‌లను కైవల్య నదిలో నిమజ్జం చేసిన దృశ్యం

గ్రామాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు

- ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ

దొరవారిసత్రం: వేసవి దృష్ట్యా మండలం పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. రెండో విడత మన బడి నాడు–నేడు కింద 19 పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన పనులు జరుగుతున్నాయని ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అక్కరపాక, ఆనేపూడి సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి కోరారు. సర్వసభ్య సమావేశానికి ఉద్యానవన శాఖ అధికారులు గైర్హాజరు కావడం పరిపాటిగా మారిందని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి శాఖకు చెందిన అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేలా చూడాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. సమావేశంలో ఎంపీడీఓ సింగయ్య, వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, అధికారులు మనోజ్‌కుమార్, కస్తూరయ్య, విజయ్‌కుమార్, పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సుజాతమ్మ

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు శనివారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. స్థానిక కేఆర్ ట్రస్ట్ ప్రతినిధి కుంపటి సునీల్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ సభ్యులు సిసీంద్రి, తిరుమల పాల్గొన్నారు.



చిల్లకూరు తహసీల్దార్ బదిలీ

చిల్లకూరు: స్థానిక తహసీల్దార్ స్వర్ణను గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓగా బదిలీ చేస్తున్నట్లు కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. బాలాయపల్లె డిప్యూటీ తహసీల్దార్ అజ్మతుల్లా ఖాన్‌ను ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చిల్లకూరుకు బదిలీ చేసినట్లు తెలిసింది. మండలంలో సాగరమాల, కోస్టల్ క్యారిడార్ భూ సేకరణ ముమ్మరంగా సాగుతున్న సమయంలో పూర్తిస్థాయి తహసీల్దార్‌ను కాకుండా ఇన్‌చార్జ్‌ను నియమించడంతో భూ పరిహారం ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు.